జన్మదిన శుభాకాంక్షలు

అత్తాపూర్ : బీఆర్ఎస్ యువనాయకుడు మిద్దెల సురేష్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అత్తాపూర్‌లో జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, అనంతరం కేట్‌కట్ చేయించారు. బీఆర్ఎస్ పార్టీకి వారు చాలాకాలంగా సేవ చేస్తూ ఎలాంటి ప్రయోజనం పొందని వ్యక్తి సురేష్ అని కొనియాడారు. వనం శ్రీరాం రెడ్డి, రాఘవేందర్ యాదవ్, సతీష్‌గౌడ్, ప్రేమ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్‌లో రాణించిన సింధు



సౌత్ ఇండియా స్థాయి సిల్వర్ పతకాన్ని సాధించిన సింధుతో కోచ్‌లు

మణికొండ: తమిళనాడులోని చెన్నై ఈ రోడ్‌లో గత మూడు రోజులుగా జరిగిన సౌత్ ఇండియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్ షిప్ -2023-24లో గండిపేట మండలం హిమాయత్‌సాగర్‌కు చెందిన వల్లెపు సింధు రాణించింది. మహిళల 72 కేజీల విభాగంలో ఆమె శుక్రవారం ద్వితీయ స్థానంలో నిలిచింది. గతంలో ఆమె రెండుసార్లు మన రాష్ట్రం తరపున 'ఖేలో ఇండియా' క్రీడల్లో పాల్గొని పతకాలను సాధించింది. ఈనెల 28 నుంచి మహారాష్ట్ర పూణేలో జరిగే సీనియర్ జాతీయ పోటీలకు ఆమె ఎంపికైందని రాష్ట్ర కోచ్‌లు నర్సింగ్‌రావు, రాజ్‌కుమార్‌లు ప్రకటించారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి పతకం సాధిస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

బీఎల్ఓ, సూపర్‌వైజర్లతో ఉప కమిషనర్ సమీక్ష



మాట్లాడుతున్న ఉపకమిషనర్ రవికుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ సర్కిల్ పరిధిలోని బీఎల్ఓ, సూపర్‌వైజర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని 108 పోలింగ్‌బూత్‌ల నుంచి 316 పోలింగ్ బూత్‌ల వరకు ఉన్న సూపర్వైజర్లతో ఈ సమావేశం నిర్వహించారు. ఒకే ఫోటోతో ఉన్న ఓటర్లు, డబుల్ ఎంట్రీలు తదితర వాటిని ఈ సమీక్షలో గుర్తించారు. వాటికి సంబంధించిన వివరాలను బీఎల్ఓలకు అందజేశారు. ప్రతి బీఎల్ఓ ఆ ప్రాంతానికి వెళ్లి సంబంధిత వారి పూర్తి వివరాలను సేకరించి ఈ ప్రక్రియను ఈనెల 18వ తేదీ వరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీనికనుగుణంగా ఉప కమిషనర్ రవికుమార్ సూపర్‌వైజర్లతో సమావేశమై పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వద్దని హెచ్చరించారు.

మహావీర్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్



అత్తాపూర్: బండ్లగూడలోని మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో శుక్రవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 6 మందిని ఎంపిక చేసుకున్నారు. వీరికి రూ.3.6 లక్షల ఆఫర్ చేసి పరీక్షలు పూర్తయిన అనంతరం విద్యార్థులను చేర్చుకుంటామని ఆఫర్ లెటర్లను అందజేయడం సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ ఉషశ్రీ, కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయరెడ్డి అన్నారు. విద్యార్థులు కళాశాల ప్లేస్‌మెంట్‌లో పొందడానికి వ్యక్తిత్వ వికాసం, ఆంగ్లభాషలో ప్రావీణ్యంతో పాటు కళాశాలలోని మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలను పొందారన్నారు. డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ మంద గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఓనెంబర్ 59ను దుర్వినియోగం చేశారు

గచ్చిబౌలి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జీఓనెంబర్ 59ను కొందరు అధికారులు దుర్వినియోగం చేస్తున్నారని, విచారణ జరిపి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి డిమాండ్ చేశారు. కొంగరకలాన్‌లోని రంగారెడ్డిజిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శశాంక్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. శేరిలింగంపల్లి మండలం నానక్‌రాంగూడ సర్వేనెంబర్ 149లో ప్రభుత్వ రికార్డుల ప్రకారం 82 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదల కోసం తీసుకొచ్చిన జీఓనెంబర్ 59ను దుర్వినియోగం చేస్తూ పల్లవు సురేందర్, మాధవిలతతో పాటు మరికొందరు ఎలాంటి ఇళ్ళ నిర్మాణాలు లేకున్నా, విద్యుత్, నల్లా బిల్లుల లాంటివి లేకుండానే దరఖాస్తులు చేసుకొని కొట్ల రూపాయల విలువల చేసే ప్రభుత్వ స్థలాన్ని పొందారన్నారు. ఎలాంటి విచారణ లేకుండానే ప్రభుత్వ స్థలాలను కట్టబెట్టిన అప్పటి తహసీల్దార్ శ్రీనివాస రావు, సీనియర్ అసిస్టెంట్ ఫ్రాంక్లిన్, ఇతర అధికారులపై విచారణ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు పనులు నిలిపివేత



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలోని రామాలయం వెనుక రోడ్డును జీహెచ్ఎంసీ రోడ్డు వేసేందుకు పనులు చేపట్టగా హెచ్ఎండీఏ సిబ్బంది నిలిపివేశారు. శుక్రవారం రోడ్డు పనులు చేస్తుండగా హెచ్ఎండీఏ స్థలంలో రోడ్డు వేయద్దంటూ సిబ్బంది పనులను ఆపారు. ఆ రోడ్డులో ఉన్న టీమ్ అబాడ్ అపార్టుమెంట్ వాసులు మాత్రం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏడు నెలల క్రితం రోడ్డు వేస్తుంటే దేవాదాయ శాఖ అధికారులు ఆ స్థలం తమదేని పనులను నిలిపివేశారన్నారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ అధికారులు తమదంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అపార్టుమెంట్‌లో 50 కుటుంబాలు నివసిస్తున్నాయని పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఉంటే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. రోడ్డు పనులు యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.



స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

వివేకానందుని జీవితం యువతకు ఆదర్శం

- దేశ భవిష్యత్తుకోసం తాపత్రయపడిన గొప్ప సంఘసంస్కర్త
- విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, బహుమతుల ప్రదానం

ఏజీవర్సిటీ: స్వామి వివేకనంద జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని భారతావనిలో జన్మించిన గొప్పమార్గ నిర్దేశకుడు, వేదాంత తత్వవేత్త భారతదేశ ప్రజల భవిష్యత్తు కోసం తాపత్రయపడిన గొప్ప సంఘసంస్కర్త స్వామి వివేకనంద అని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రశాంత్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో స్వామి వివేకనంద 161వ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజల అభ్యున్నతికి నాలుగు పర్యాయాలు దేశం మొత్తం తిరిగిన జ్ఞానవేత్త అని కొనియాడారు. స్వామి వివేకానంద ఎందరో మహానుభావులకు ఆదర్శప్రాయుడిగా ఉన్నారని, అలాంటి మహామేధావిని అందరూ అనుసరించాలని కోరారు. ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ అధికారి సీఎన్ఆన్ సంతోషిని, కళాధర్‌బాబు, ఆశ్వస్‌కుమార్, ఓఎస్ఏ నాగహర్షిత, నిరోషా, మమత, రామకృష్ణ, పరమహంస, తులసిరాణి, శ్రీరాములు, శ్రీనాథ్, రజిత, తిరుపతయ్య, ప్రవల్లిక, శ్రీకాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు విజ్ఞానం అవసరం..

మైలార్‌దేవ్‌పల్లి : విద్యార్థులకు చదువుతో పాటు జ్ఞానాన్ని పెంపొందించే వ్యాసరచన పోటీలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం రామక్రిష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 162వ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. మండల స్థాయిలో 26 పాఠశాలలో 2019 మంది విద్యార్థులు వివేకానంద వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చేతులుమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వామి వివేకానంద లాంటి మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వివేకానందుడు గొప్ప మేధావి, భారతదేశ ఖ్యాతిని పెంచిన మహనీయుడని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

◆ రాజేంద్రనగర్ స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాల విద్యార్థి శ్రీచరణ్ మొదటి బహుమతి సొంతం చేసుకోగా.. రెండో బహుమతి అత్తాపూర్ టైనీ స్కాలర్ స్కూల్ విద్యార్థి అవినాష్ , మూడో బహుమతి పయోనీర్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థి రిషికరెడ్డి గెలుచుకున్నారు. విద్యార్థులకు నగదుతో పాటు వివేకానంద సాహిత్యాన్ని అందజేశారు. మొత్తం రూ.51 వేలతో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. శ్రీరామక్రిష్ణ సేవాసమితి అధ్యక్షుడు బొల్ల శ్రీనివాస్, స్థానిక నాయకులు మసున వెంకటేష్, సూర్య కిరణ్, గంజి వెంకటేష్, కాశిగారి యాదగిరి, నరేందర్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

యువతకు మార్గదర్శి వివేకుడు..

మణికొండ : భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పడంతో పాటు యువతకు స్వామి వివేకానంద మార్గదర్శిగా నిలిచారని గండిపేట మండల మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, ఖానాపూర్ కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వివేకానంద జయంతి సందర్భంగా నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్‌లో ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఆర్.నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణ, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కార్యదర్శి కిషన్, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీనగర్‌లో..

బండ్లగూడ: నేటి యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా కార్పొరేషన్ పరిధిలోని గాయత్రీనగర్‌లోని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాలనీ అధ్యక్షుడు కుమారస్వామి, చారి, వీరేష్, నరేష్ తదితరులున్నారు.



ఖానాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



గాయత్రీనగర్‌లో మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్

బాక్స్‌డ్రైన్ నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి



వినతిపత్రం ఇస్తున్న స్థానిక కాలనీల నాయకులు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మణికొండ: వరదముంపు, దుర్వాసనను దూరం చేసేలా పందెన్‌వాగు నాలాకు బాక్స్‌డ్రైన్ నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటీ కాలనీ నుంచి ట్రయల్స్ విల్లాల వరకు రూ.9.5కోట్లతో కొనసాగుతున్న బాక్స్‌డ్రైన్ పనులతో పాటు ట్రయల్స్ విల్లాల నుంచి శ్రీనివాసకాలనీ, ఎంప్లాయిస్ కాలనీ, సెక్రటేరియట్ కాలనీ, స్పెక్ట్రమ్ విల్లాస్, పయనీర్ ఎస్టేట్ ద్వారా నెక్నాంపూర్ చెరువు వరకు ఉన్న పందెన్‌వాగును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు కాలనీవాసులు తాము వర్షాకాలంలో వరద, ఇతర కాలాల్లో దుర్గంధాన్ని భరించలేకపోతున్నామన్నారు. సాధ్యమైన చోట నాలాకు బాక్స్‌డ్రైన్ నిర్మాణం చేపడితే అనేక కాలనీల ప్రజల సమస్య దూరం అవుతుందని ఆయనకు వివరించారు. బుల్కాపూర్ నాలాలో ఖాజాగూడ మణికొండ ఎల్లమ్మ చెరువుల నుంచి వస్తున్న మురుగునీటిని పంచవటీ కాలనీ రోడ్డు నెంబర్ 10 వద్ద పందెన్‌వాగులోకి కాకుండా షేక్‌పేట వైపు చెక్‌డ్యాంను నిర్మించి దారి మళ్లించాలని కోరారు. దీంతో చెక్‌డ్యాంతో పాటు ట్రయల్స్ విల్లాల నుంచి నెక్నాంపూర్ చెరువు వరకు పందెన్‌వాగుకు బాక్స్‌డ్రైన్ నిర్మాణం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపాలని అధికారులను ఆదేశించారు. బాక్స్‌డ్రైన్ నిర్మాణాలకు అయ్యే ఖర్చు వివరాలను పొందుపరుస్తూ.. నివేదికను పంపిస్తే నిధులను రాబట్టేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ ఫల్గుణ్ కుమార్, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు పద్మారావు, నవీన్‌కుమార్, లక్ష్మీనారాయణ, కావ్యశ్రీ రాములు, శైలజ వినోద్‌కుమార్, కో-ఆప్షన్ సభ్యులు సిద్దప్ప, తాజుద్దీన్, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు సీతారాంలతో పాటు పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మల్లన్న ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న అశోక్‌యాదవ్ తదితరులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని మల్లికార్జునస్వామి దేవాలయ ఉత్సవాలు ఈనెల 20వ తేదీ నుంచి 23 వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్ తెలిపారు. ఉత్సవాల పోస్టర్‌ను శుక్రవారం దేవాలయ ఆవరణలో కమిటీ సభ్యులు, నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 21న ఉదయం గోపూజ, గణపతిపూజ, రాత్రి 7గంటలకు అగ్నిగుండాలు, 8 గంటలకు సొదమ్మ బోనాలు, రాత్రి 9గంటల నుంచి మల్లన్న ఒగ్గకథ ఉంటుందన్నారు. 22న నాగవల్లి, 23న ఎల్లమ్మ కల్యాణం , బోనాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలేవి?

అత్తాపూర్ : పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని అత్తాపూర్ నుంచి బాపుఘాట్ వెళ్లే ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో లంగర్‌హౌజ్ బాపుఘాట్ ప్రాంతంలో దివంగత సీఎం డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో బ్రిడ్జి నిర్మాణం చేయడంతో పాటు ఈ రోడ్డు మార్గాలను అనుసంధానం చేశారు. అత్తాపూర్ మూసీ పరివాహక ప్రాంతంలో నూతనంగా రోడ్డు మార్గాన్ని అనుసంధానం చేయడంతో తాండూర్ చేవెళ్ల, వికారాబాద్, పరిగి, మొయినాబాద్, శంకర్‌పల్లి, నార్సింగి తదితర ప్రాంతాలకు వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఈ మార్గం గుండా ప్రయాణిస్తున్నారు. జయప్రియ యాటో ప్రియా, డాక్టర్ కాలనీ మీదుగా వాహనాలు ఈ రహదారి మీదుగా తిరుగుతుంటారు. మూసీ పరివాహక ప్రాంతం రహదారి గుండా వచ్చే వాహనాలు లంగర్‌హౌజ్ వాహనదారులు ఇబ్బందులకు గురౌతున్నారు. ఒకరిని మించి మరొక వాహనదారుడు పోటీపడుతూ.. వాహనాలు నడపడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రెండు మార్గాల నుంచి వచ్చే వాహనదారులకు సిగ్నల్స్ లేని కారణంలో ఎటువైపు వాహనం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో లంగర్‌హౌజ్ మూసీ చౌరస్తా ప్రమాదకరంగా మారింది. ఈ బ్రిడ్జి సమీపంలో వచ్చే టిప్పర్లు, లారీల కారణంగా సమస్య మరింత జఠిలంగా మారుతుందని వాహనదారులు వాపోతున్నారు.



అత్తాపూర్ నుంచి బాపుఘాట్ వెళ్లే ప్రధాన రహదారి

ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలి..



అత్తాపూర్ నుంచి లంగర్‌హౌజ్‌కు వెళ్లే వాహనదారులు అత్తాపూర్ మూసీ ప్రధాన రహదారి నుంచి లంగర్ హౌస్ వైపు వెళ్లే వాహనదారులు లంగర్‌హౌజ్ బ్రిడ్జి సమీపం చౌరస్తాలో ఇబ్బందులకు గురౌతున్నారు. వాహనాల రద్దీని బట్టి ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ట్రాఫిక్ అధికారులపై ఉంది. ఈ చౌరస్తాలో సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తూ.. ట్రాఫిక్ అధికారులను నియమించాల్సి ఉంది.

– గూడెం మల్లారెడ్డి, అత్తాపూర్ గ్రామస్తుడు

ప్రత్యేక చర్యలు తీసుకుంటాం..




నగరంలో పెరిగిపోతున్న జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ఆయా మార్గాలలో రోడ్లను అనుసంధానం చేస్తూ.. ప్రమాదాలు జరగకుండా చూస్తున్నాం. అత్తాపూర్ మూసీ పరివాహక ప్రాంతం నుంచి నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డులో వాహనాల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఈ చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తాం.

– బోసు కిరణ్, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

పేద ప్రజల నాయకుడు పీజేఆర్

హఫీజ్‌పేట్ : పేద ప్రజల నాయకుడు మాజీ మంత్రి, స్వర్గీయ పీ.జనార్ధన్‌రెడ్డి అని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం శేరిలింగంపల్లి, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలో పీజేఆర్ జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. పాపిరెడ్డి కాలనీ, గంగారం ప్రాంతాలలోని పీజేఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి పేద ప్రజల గుండెలలో నిలిచిపోయిన వ్యక్తి అని అన్నారు. పీజేఆర్‌తో తమకున్న అనుబంధంతో పాటు ఆయన పేదలకు చేసిన సేవలను గుర్తు చేశారు.

కొత్తశోభతో సంక్రాంతి ప్రారంభం



మాట్లాడుతున్న విజ్ఞాన్ కళాశాల చైర్మన్ గౌరీ సతీష్

బండ్లగూడ/రాజేంద్రనగర్: సంక్రాంతి పండుగ జీవితంలో కొత్త శోభతో ప్రారంభమవుతుందని విజ్ఞాన్ కళాశాల చైర్మన్ గౌరీ సతీష్ అన్నారు. బండ్లగూడలోని కళాశాలలో శుక్రవారం రంగోళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగగా ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ప్రతి ఏటా కొత్తగా వస్తుందని, మన సంస్కృతి, సాంప్రదాయాలను విద్యార్థులకు నేర్పించేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

జీఐహెచ్ఎస్‌లో సంక్రాంతి వేడుకలు

రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని గేట్వే ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో సంక్రాంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగువారి సంప్రదాయాలను తెలియజేయాలన్న ఉద్దేశంతో పాఠశాలలో ఏటా సంక్రాంతి వేడుకలను నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ మామిడి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వివేకానందున్ని స్మరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థుల తల్లులకు రంగోళి పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. పాఠశాల ఫౌండర్ మామిడి వీరమణి, ప్రిన్సిపల్ సరిత మానె తదితరులున్నారు.



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు

సొంతూళ్లకు పయనం

- రద్దీతో నిండిపోయిన అరాంఘర్ చౌరస్తా
- పోలీసుల బందోబస్తులో బస్‌స్టాప్

మైలార్‌దేవ్‌పల్లి : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బతుకుదెరువు కోసం వలస వచ్చిన ప్రజలు పండుగకు తమ కుటుంబంతో కలిసి రెండ్రోజుల ముందే సొంతూళ్లకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్రంలో మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా సిటీ, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉండటంతో రద్దీ పెరిగింది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అరాంఘర్ చౌరస్తాలో కర్నూల్, వికారాబాద్, షాద్‌నగర్, గద్వాల ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు శుక్రవారం ఉదయం 5 గంటల నుంచే రద్దీతో నిండిపోయింది. గత మూడు రోజుల నుంచి ప్రయాణీకులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ పోలీసుల సాయం తీసుకుని రద్దీని కంట్రోల్ చేస్తున్నారు. ప్రయాణికుల్లో మహిళలే అధికంగా కనిపించడం గమనార్హం. ఆరాంఘర్ చౌరస్తాలో సిటీ బస్సులతో పాటు గ్రామాలకు వెళ్లే బస్సులు ఎక్కువగా ఉండటంతో ప్రయాణీకుల రద్దీ తీవ్రంగా పెరిగిందని ఆర్టీసీ డిపో-1 మేనేజర్ తెలిపారు. వారు ఇబ్బందులు ఎదుర్కోకుండా సరైన సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. వృద్ధులు, మహిళలు, యువతీయువకులు అందరూ తమ సొంతూళ్లకు ప్రయాణం సాఫీగా సాగించేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు.



బస్టాండ్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



సొంతూళ్లకు బయలుదేరిన ప్రయాణికులు



బస్సు కోసం ఎదురుచూస్తున్న దృశ్యం